మానసిక ఒత్తిడిని జయించాలి : జిల్లా అధికారి

తలమడుగు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ఆత్మ విశ్వాసం అనే ఆయుధంతో మానసిక ఒత్తిడిని చేయించవచ్చని జిల్లా విద్యా శాఖ సెక్టోరియల్ అధికారి నారాయణ అన్నారు. బుధవారం మండలంలోనరి దేవాపూర్ పాఠశాలను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులను సమయ పాలన అలవర్చుకోవాలని, ఎప్పటి పనులు అప్పుడు పూర్తి చేసుకోవాలని సూచించారు. తర్వాత ఆరోగ్య పాఠశాల కార్యక్రమం అమలు పర్యవేక్షణలో భాగంగా మావల ఉన్నత పాఠశాల, దేవాపూర్ ఉన్నత పాఠశాలను సందర్శించి మానసిక ఒత్తిడిని జయించడం ఎలా అనే అంశంపై విద్యార్థులకు వివరించారు.



● గుడిహత్నూర్‌లో పత్తి అక్రమ కొనుగోళ్లను పరిశీలిస్తున్న రైతు సంఘం నేతలు

ఆగని దళారీ దందా

- జిల్లాలో విచ్చలవిడిగా పత్తి అక్రమ కొనుగోళ్లు
- రైతుల అవసరాలను ఆసరాగా చేసుకుంటూ దోపిడీ
- అందినకాడికి దండుకుంటున్న దళారులు
- బినామీ రైతుల పేరిట సీసీఐ కొనుగోలు కేంద్రాలకు తరలింపు
- కరువైన అధికారుల పర్యవేక్షణ
- ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న వ్యాపారులు
- మద్దతుధర దక్కకపోవడంతో దగాపడుతున్న పత్తి రైతులు

ఆదిలాబాద్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పత్తి కొనుగోళ్లలో దళారీ దందాకు అడ్డుకట్ట పడడం లేదు. రైతుల అత్యవసర ఆర్థిక పరిస్థితులను ఆసరాగా చేసుకుంటున్న దళారులు.. అందినకాడికి దండుకుంటున్నారు. జిల్లాలోని మారుమూల గ్రామాలతో పాటు మండల కేంద్రాలలోను విచ్చలవిడిగా పత్తి అక్రమ కొనుగోళ్లు జరుగుతున్నాయి. మార్కెటింగ్, వ్యవసాయ శాఖ అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో అక్రమదందాకు అడ్డు అదుపే లేకుండా పోతోంది. ముఖ్యంగా జిల్లాకేంద్రంతో పాటు ఉట్నూర్, నార్నూర్, గాదిగూడ, ఇంద్రవెల్లి, సిరికొండ, గుడిహత్నూర్, ఇచ్చోడ, బజార్‌హత్నూర్, బోథ్ మండలాల్లో జోరుగా పత్తి అక్రమ కొనుగోళ్లు సాగుతున్నాయి. టాస్క్‌ఫోర్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల నిఘా వైఫల్యం ప్రైవేట్ వ్యాపారులకు కలిసి వస్తోంది. అడపాదడప అధికారులు తనిఖీలు చేస్తున్న ఆర్థిక పరపతితో అక్రమ దందాలకు అడ్డురాకుండా వ్యాపారులు జాగ్రత్త పడుతున్నారు. కాదు కూడదు అంటే రాజకీయ నేతలతో ఒత్తిళ్లు చేయించేందుకు వెనుకాడడం లేదు. నిత్యం దళారులు వందలాది క్వింటాళ్ల పత్తి, సోయాలను కొనుగోలు చేస్తూ అడ్డదారిలో అమ్మేసుకుంటున్నారు. ఇదంతా పట్టపగలే నడిరోడ్డుపై జరుగుతున్న సంబంధిత శాఖఅధికారులకు పట్టింపు లేక పోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. భారీగా ముడుపులు ముట్టచెప్పడంతో అధికారులు అటువైపు కన్నెత్తయినా చూడడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. మార్కెటింగ్ శాఖలో కిందిస్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు అధికారుల హోదాను బట్టి తలోకొంత ముట్టచెప్పడంతోనే సైలెంట్‌ై పోతున్నారన్న ఆరోపణలు లేకపోలేదు. కుల సర్వే పేరిట అధికారులు పర్యవేక్షణ చేసేందుకు చేతులెత్తేయడంతో ప్రైవేట్ వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఈ విషయమై జిల్లా మార్కెటింగ్ అధికారి గజానంద్‌ను ఫోన్‌లో వివరణ కోరగా స్పందించకపోవడం గమనార్హం.



ఈ ఫొటోలో కనిపిస్తున్న రైతు పేరు రాహుల్ గుడిహత్నూర్ మండలం లింగాపూర్ గ్రామం. గుడిహత్నూర్ మండల కేంద్రంలోని ఓ దళారికి 15కిలోల పత్తిని కిలోరూ.65 చొప్పున విక్రయించాడు. దీంతో ఆయనకు రూ.975ల నగదు చేతికి వచ్చింది. రోజు వారి కూలీల ఖర్చులకు చెల్లించేందుకు చేతిలో నగదు లేనందున అత్యవసరమై పత్తిని విక్రయించాల్సి వచ్చిందని పేర్కొన్నాడు. ఇలాంటి పరిస్థితులే జిల్లాలో చాలా గ్రామాలలో కనిపిస్తున్నాయి. రైతుల అత్యవసర పరిస్థితిని ఆసరాగా చేసుకుంటున్న దళారులు అడ్డగోలుగా పత్తిని కొనుగోలు చేస్తూ సీసీఐకి అమ్మేసుకుంటున్నారు.

కిలో పత్తి రూ.65

పత్తి రైతులకు నగదును ఆశ చూపుతున్న దళారులు కిలో పత్తికి రూ.65 చెల్లిస్తూ కొనుగోలు చేస్తున్నారు. దీంతో క్వింటాల్ పత్తి ధర రూ.6500 పలుకుతోంది. మద్దతు ధర దక్కకపోవడంతో ఒక్కో క్వింటాల్‌కు రూ.వెయ్యి చొప్పున రైతులు నష్టపోతున్నారు. ఇలా జిల్లాలో నిత్యం వేల క్వింటాళ్ల పత్తిని దళారులు దండుకుంటున్నారు. దీంతో రైతులు నష్టపోవడంతో పాటు మార్కెట్ ఆదాయానికి గండి పడుతోంది. సీజన్‌లో ఒక్కో వ్యాపారి నెలకు రూ.లక్ష నుంచి రూ.రెండు లక్షల వరకు సంపాదిస్తున్నారంటే ఏ స్థాయిలో దోపిడీ దందా జరుగుతుందో తెలుస్తూనే ఉంది. అధికారులు కఠినంగా వ్యవహరించకపోవడంతో రైతులు నిండా మునుగుతున్నారు. ప్రారంభంలో ఏదో హడావుడి, ఆర్భాటం చేస్తున్న అధికారులు ఆ తర్వాత పత్తి కొనుగోళ్లను అసలు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. తేమ, నాణ్యత లేదన్న కారణంగా ధరలో భారీగా కోతలు విధిస్తున్నారు. రైతులు అత్యవసరాల పేరిట కిలోల కొద్ది పత్తిని విక్రయిస్తూ.. ఆర్థిక అవసరాలను తీర్చుకుంటూ నష్టపోతున్నారు. ప్రైవేట్ వ్యాపారులకు విక్రయిస్తే ధరలో కోతలు విధిస్తున్న గత్యంతరం లేక అమ్ముకోవాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు. నగదు ఇస్తేనే కూలీలు పత్తి ఏరేందుకు వస్తున్నారని లేకపోతే కూలీలు దొరకడం కష్టంగా మారిందంటున్నారు.

జోరుగా బినామీ దందా

సీసీఐ కొనుగోలు కేంద్రాలలో కొందరు వ్యాపారులు బినామీ దందాకు తెరలేపుతున్నారు. సీసీఐ అధికారులతో చేతులు కలుపుతున్న దళారులు అక్రమంగా కొనుగోలు చేసిన పత్తిని అమ్మేసుకుంటూ మద్దతుధరను దక్కించుకుంటున్నారు. రైతుల

(తరువాయి 6వ పేజీలో...)



● అమ్మేందుకు ఆటోలో పత్తిని తీసుకొచ్చిన రైతులు

మెనూ ప్రకారం అందించాలి

- ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన ఎంఈవో
- విద్యార్థులతో కలిసి భోజనం చేసిన అధికారి వెంకట్‌రావు

6



'మహా' వైపు పెద్దపులి పయనం

- మహారాష్ట్రలోని తిప్పేశ్వర్ అభయారణ్యంలోకి చేరుకున్న పులి
- చివరగా కాడికిలో పాదముద్రలు సేకరించిన అటవీ అధికారులు

7



పత్తి పంటలపై పందుల దాడి

- తలమడుగులో చేతికి వచ్చిన పంటను నాశనం చేస్తున్న అడవి పందులు
- అధికారులకు విన్నవించినా.. పట్టింపు కరువాయే అంటున్న రైతులు

7





మహాసభలో ప్రసంగిస్తున్న రాష్ట్ర కన్వీనర్ బుర్స పోచయ్య

ఆదివాసీల హక్కుల రక్షణ కోసం కదం తొక్కాలి

● తుడుందెబ్బ రాష్ట్ర కన్వీనర్ బుర్సపోచయ్య

ఉట్నూర్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఆదివాసీ గిరిజనుల హక్కుల రక్షణ కోసం తుడందెబ్బ కదం తొక్కుతుందని తుడుందెబ్బ రాష్ట్ర కన్వీనర్ బుర్స పోచయ్య అన్నారు. బుఉధవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని గిరిజన్ భవన్‌లో నిర్వహించిన తుడుందెబ్బ జిల్లా మహాసభలకు ఉమ్మడి జిల్లాలోని నిర్మల్, మంచిర్యాల, కొమురంభీం ఆసిఫాబాద్, ఆదిలాబాద్ జిల్లాల నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో బుర్సపోచయ్య మాట్లాడుతూ ఎందరో మహానుభావులు ఉద్యమాలు చేయడంతో రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ అధికారం మేరకు ఏజెన్సీ ప్రాంతాలలో ఐదవ షెడ్యూల్ కింద ఆదివాసీ గిరిజనుల హక్కులను కాపాడాలని రాయడంతో ప్రభుత్వాలు ఆదివాసీలు హక్కుల రక్షణ కోసం కృషి చేస్తున్నాయన్నారు. ఏజెన్సీ ప్రాంతాలలో వలసవాదులు వచ్చి గిరిజనుల అమాయకత్వాన్ని ఆసరా చేసుకుని లబ్ధి పొందడంతో పాటు గిరిజనులను అన్ని రకాలుగా వంచిస్తున్నారని, అలాంటి వారిపై ఆదివాసీ హక్కుల పోరాట సమితి పోరు ప్రారంభించింది అన్నారు. ఆదివాసీ హక్కుల పోరాట సమితి, అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాలోని గిరిజనుల హక్కుల రక్షణ, ఆదివాసీల అభివృద్ధి కోసం తుడుందెబ్బ పని చేస్తోందన్నారు. ఐదవ షెడ్యూల్ ప్రాంతంలో మా ఊళ్లో మా రాజ్యం, మావ నాటే మావ సర్కార్ కోసం కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏజెన్సీ ప్రాంతాలలో భూబదలాయింపు చట్టం, పీసా చట్టం, కాపాడుతూ లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. మూడేళ్ల క్రితం హస్నాపూర్‌లో ఆదివాసులు లంబాడాల మధ్య జరిగిన ఘర్షణతో ప్రభుత్వం ఒక సమస్య పరిష్కరిస్తామని ప్రకటించిన నేటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. గత రెండు నెలల క్రితం జైనూర్ మండల కేంద్రంలో జరిగిన హింసాత్మక ఘటనలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ఏజెన్సీ ప్రాంతాలలో వలస వాదులు రావడం వల్లనే ఏజెన్సీ ప్రాంతాల పరిస్థితి ఇబ్బందిగా తయారవుతుందని ప్రభుత్వం గ్రహించాలన్నారు. ఈ సందర్భంగా తుడుందెబ్బ మంచిర్యాల, ఆసిఫాబాద్, ఆదిలాబాద్ జిల్లా కమిటీలను ఏక్రీవంగా ఎన్నుకోగా నిర్మల్ జిల్లా కమిటీని ఈనెల 23న ఖానాపూర్‌లో ఎన్నుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గోడం నగేష్, పురక బాపురావు, గోడం నగేష్, కుడిమిత తిరుపతి, గుర్రాల రవీందర్, పంద్ర జైవంతరావు, కోట్నాక్ విజయ్, ఆత్రం ఆనంద్‌రావు, పెందూర్ పుష్పారాణి, రేణుకబాయి, ఆత్రం మోతీరాం, సిడాం సోనేరావు బాజీరావు, తదితరులు పాల్గొన్నారు.

● తుడుందెబ్బ ఆదిలాబాద్ జిల్లా కమిటీ ఇదీ..

ఆదివాసీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడిగా పెందూర్తి దాదారావు, ఉపాధ్యక్షుడిగా సంతోష్, మిశ్రమ భాస్కర్, సిడాం జంగ్‌దేవ్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నైతం రమేష్, ప్రధాన కార్యదర్శిగా వెట్టిమనోజ్, కార్యదర్శులుగా జడం భారత్, సోయంరాందాస్,మేస్రం ఒమాణిక్‌రావు, ప్రచార కార్యదర్శిగా కచ్చికడువిష్ణు, కోశాధికారిగా కోట్నాక్ బారికరావు,జిల్లా గౌరవ అధ్యక్షులుగా పంద్ర జైవంత్‌రావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



రాత్రివేళ గిర్నూర్ గ్రామంలో సంచరిస్తున్న అడవి పందుల గుంపు

ఊళ్లోకి చొరబడిన అడవి పందులు

బజార్‌హత్నూర్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని గిర్నూర్ గ్రామంలో అర్ధరాత్రి వేళలో అడవి పందులు గుంపు పంచరించడంతో గ్రామంలోని ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. గ్రామం గుండా అంతర్రాష్ట్ర రహదారి వెళ్లడంతో ఎప్పుడూ రద్దీగా ఉన్నప్పటికీ.. రాత్రి వేలలో దాదాపు యాభైకు పైగా పందులు ఒక్కసారిగా ప్రధాన రహదారి పక్కనే ఉన్నా ఓ ఇంటి వద్ద ఉండడంతో ఆ ఇంటి యజమాని, గ్రామస్థులు భయభ్రాంతులకు గురయ్యారు. అటవీ ప్రాంతంలో ఉండాల్సిన పందులు గ్రామంలోనే సంచరించడంతో రాత్రివేళలో బయటకు రావాలంటే ప్రజలు జంకుతున్నారు. అటవీ శాఖా అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

పొన్నారిలో అండర్ రైల్వే బ్రిడ్జి నిర్మాణ పనుల పరిశీలన

తాంసి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని పొన్నారి గ్రామ సమీపం నుంచి వెళ్లే రైలు అండర్ బ్రిడ్జి నిర్మాణం కోసం గ్రామస్థులు గతంలో పలువురికి విన్నవించారు. ఈ విషయాన్ని తెలుసుకున్న సౌత్ జోన్ రైల్వే బోర్డు మెంబర్ రఘుపతి బుధవారం సాయంత్రం బ్రిడ్జి నిర్మాణం ఎక్కడ చేపట్టాలో పరిశీలించారు. ఈ బ్రిడ్జి నిర్మాణం లేకపోవడంతో గ్రామస్థులు పడుతున్న ఇబ్బందులను ఆయన తెలుసుకున్నారు. ముఖ్యంగా నిత్యం రైతులు వివిధ పనుల నిమిత్తం కాలినడకన వెళ్లే సమయంలో రైలు రావడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆయనకు ఈ సందర్భంగా స్థానికులు విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలోనే కేంద్ర ప్రభుత్వానికి నివేదించి అండర్ బ్రిడ్జి నిర్మాణం అయ్యేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు. ఆయనతో పాటు మాజీ ఎంపీటీసీ రేఖ, రఘు పలువురు నాయకులు, తదితరులు ఉన్నారు.



బ్రిడ్జి నిర్మించే ప్రాంతాన్ని పరిశీలిస్తున్న రైల్వే జోన్ మెంబర్ రఘుపతి



బహుమతులను అందజేస్తున్న ఎమ్మెల్యే పాయల శంకర్

గ్రంథాలయ అభివృద్ధికి కృషి

● ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్

ఆదిలాబాద్ రూరల్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. బుధవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని గ్రంథాలయంలో నిర్వహిస్తున్న 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ముగిశాయి. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మొదటగా సరస్వతి దేవి చిత్రపటానికి పూజలు నిర్వహించారు. గ్రంథాలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. పుస్తక పఠనాన్ని ప్రతిఒక్కరూ అలవర్చుకోవాలన్నారు. అనంతరం వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెమోంటోలు అందేశారు. తల్లిదండ్రులు సైతం వారి చిన్నారులకు పుస్తక పఠనం విషయంలో ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో లైబ్రరీ శ్రీనివాస్, అశోక్ రెడ్డి, అంకాత్ రమేష్, ముకుంద్ సుభాష్, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీపై సీఎం విమర్శలు అర్థరహితం

నిర్మల్ కల్చరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : సీఎం రేవంత్‌రెడ్డి బీజేపీ పైన, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిపై చేస్తున్న విమర్శలు అర్థరహితమని బీజేపీ నాయకుడు రావుల రాంనాథ్ అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. వరంగల్‌లో సీఎం చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. బీజేపీని విమర్శిస్తూ కాంగ్రెస్ అగ్రనేత మెప్పుకోసం ప్రయత్నిస్తున్నారన్నారు. అధికారం చేపట్టి ఏడాది కావస్తున్నా ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయలేక ప్రజల దృష్టి మరల్చుతూ చౌకబారు ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా బీజేపీపై విమర్శలు మానుకోవాలని లేనట్టయితే ప్రజలు ఊరుకోరన్నారు. ప్రజా సమస్యలపై ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

విద్యార్థులు మంచి మార్కులు సాధించాలి

● మండల విద్యాధికారి బి.చంద్రకాంత్



వంట గదిని పరిశీలిస్తున్న మండల విద్యాధికారి

నిర్మల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : లోకేశ్వరం మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని బుధవారం మండల విద్యాధికారి బి.చంద్రకాంత్ సందర్శించారు. పదోతరగతి గదిలోకి వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. పదోతరగతి విద్యార్థులు బాగా కష్టపడి చదివి పరీక్షల్లో బాగా మార్కులు సంపాదించి పాఠశాల పేరు, ఉపాధ్యాయుల పేరు, తల్లిదండ్రుల పేరు నిలబెట్టాలన్నారు. ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో, పట్టుదలతో చదవాలన్నారు. అప్పుడే పరీక్షల్లో మంచి మార్కులతో అందరూ తప్పకుండా పాస్ అవుతారన్నారు. అలాగే విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల స్పెషల్ ఆఫీసర్, తదితరులు పాల్గొన్నారు.

కారులో నుంచి డబ్బులు చోరీ



బాధితుడి కారు

భైంసా రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : భైంసా పట్టణంలో బుధవారం బస్టాండ్ పక్కన ఎస్‌బీఐ బ్యాంక్ ఆవరణలో ఉన్న కారు అద్దాలు పగలగొట్టి గుర్తుతెలియని దుండగులు రూ. 1,80,000లు దొంగిలించారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం లోకేశ్వరం మండలం గడ్‌చందా గ్రామానికి చెందిన అల్లం భోజన్న బీడీ కంపెనీ నిర్వహిస్తుంగా బీడీ వర్కర్లకు పేమెంట్ చెల్లించేందుకు రూ. 90 వేలను ఎస్‌బీఐ బ్యాంక్‌లో విత్‌డ్రా చేసుకొని మరో 90,000లను బ్యాగులో ఉంచుకొని, మొత్తం 1,80,000లను కారులో ఉంచాడు. ఇది గమనించిన దుండగులు కారు అద్దాలు పగలగొట్టి దొంగిలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దుండగుల కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఇసుక, మట్టి టిప్పర్ల పట్టివేత



అధికారులు స్వాధీనం చేసుకున్న టిప్పర్

ముథోల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన ముథోల్‌లోని నయాబాది సమీపాన బుధవారం సాయంత్రం మైనింగ్ రాయల్టీ ఇన్‌స్పెక్టర్ కే.ఆనంద్ సంబంధిత పత్రాలు లేకుండా మట్టి, ఇసుకను తరలిస్తున్న టిప్పర్లను పట్టుకున్నారు. నిజామాబాద్ జిల్లా కందకుర్తి నుంచి భైంసా వైపు వస్తున్న ఇసుక టిప్పర్, అలాగే విట్టోలి రోడ్డు నుంచి ముథోల్‌కు వస్తున్న మట్టి టిప్పర్‌లను సంబంధిత అనుమతి పత్రాలు లేని కారణంగా వాహనాలను స్వాధీనం చేసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు మైనింగ్ రాయల్టీ ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

ఐసీడీఎస్ వాహనం వేలం పాట

ముథోల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ముథోల్ ఐసీడీఎస్ కార్యాలయంలో గల వాహనం (జీప్ నెంబర్ ఏపీ 1ఏ 3504) వేలంపాటను బుధవారం సీడీపీవో సరోజిని ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ వేలంలో మొత్తం ఏడుగురు పాల్గొనగా ముథోల్‌కు చెందిన మజరోద్దీన్ అనే వ్యక్తి రూ. 18 వేలకు దక్కించుకున్నట్లు సంబంధిత సీనియర్ అసిస్టెంట్ విజయ్‌కుమార్ తెలిపారు.

రేపు విద్యుత్ వినియోగదారుల వేదిక

నిర్మల్ కల్చరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ వినియోగదారుల సమస్య పరిష్కారానికి శుక్రవారం లక్ష్మణచాంద మండల కేంద్ర సబ్‌స్టేషన్‌లో వేదిక ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. సమస్య పరిష్కార న్యాయ స్థలం నిజామాబాద్ ఆధ్వర్యంలో వినియోగదారులు ఫిర్యాదు చేసి సమస్యలు పరిష్కరించుకోవచ్చునని పేర్కొన్నారు. నిర్మల్ రూరల్, దిలావర్‌పూర్, సారంగాపూర్, బీరవెల్లి పరిధిలోని వినియోగదారులు ఈ అవకాశం వినియోగించుకోవాలని కోరారు.

సర్వే పకడ్బందీగా నిర్వహించండి

కుబీర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీవో నవనీత్‌కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని ధార్‌కుబీర్‌లో నిర్వహించిన సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు అందజేశారు. ఈయన వెంట ఎంపీవో మోహన్‌సింగ్, తదితరులున్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి : మాజీఎమ్మెల్యే

కుబీర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని ఆయా గ్రామాల్లో అభివృద్ధి కోసం మంజూరయిన ప్రొసిడింగ్ కాపీలను అందజేశారు. మండలంలోని సావులి అనుబంధ గ్రామం లింగిలో నీటి ఎద్దడి సమస్య పరిష్కారానికి మంజూరైన నిధులు రూ. 10లక్షల ఎస్‌డీఎఫ్ నిధుల ప్రొసిడింగ్ కాపీ, మండలంలోని శివుని తండా నుంచి మేదన్‌పూర్ వరకు ఫార్మేషన్ అండ్ గ్రావెల్ కోసం రూ. 3లక్షల నిధులు మంజూరు కాగా సంబంధిత ప్రొసిడింగ్ కాపీని, మండలంలోని జుమ్డా గ్రామ అనుబంధ గ్రామమైన రాజురాలో ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం రూ. 50వేల ప్రసిడింగ్ కాపీని గ్రామస్తులకు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు తూం రాజేశ్వర్, ఆయా గ్రామాలనాయకులున్నారు.



ప్రొసిడింగ్ కాపీలను అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

ఆగని దళారీ దందా

(5వ పేజీ తరువాయి...)

నుంచి కిలోల కొద్ది కొనుగోలు చేసిన పత్తిని నిల్వ చేస్తున్న దళారులు పెద్దమొత్తంలో తిరిగి సీసీఐ కొనుగోలు కేంద్రాలకు తరలిస్తూ అధిక ధరలకు అమ్మేసుకుంటున్నారు. ఇలా నిత్యం వందలాది క్వింటాళ్ల పత్తిని అమ్మేస్తూ రూ.లక్షలు జేబులో వేసుకుంటున్నారు. వ్యాపారులకు సన్నిహితంగా ఉండే రైతుల పట్టా పాస్‌పుస్తకం, బ్యాంకు ఖాతాలు, ఆధార్ కార్డులతో సీసీఐకి పత్తిని విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇదంతా అధికారులకు తెలిసినా తెలియనట్లుగానే వ్యవహరిస్తున్నారు. జిల్లాలో ఏర్పాటు చేసిన సీసీఐ కొనుగోలు కేంద్రాలపై అధికారులు నిఘా సారిస్తే అసలు విషయం వెలుగులోకి వచ్చే అవకాశం ఉంటుంది. అలాగే కొన్ని కేంద్రాలలో జరిగిన పత్తి కొనుగోళ్లను క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తే అసలు భాగోతం బయట పడే అస్కారం ఉంటుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. బినామీ దందాకు అడ్డకట్ట వేస్తేనే దళారి దందా అదుపులోకి వచ్చే అవకాశం ఉంటుంది. కానీ అడ్డుకట్ట వేయాల్సిన అధికారులే అండగా నిలవడంతో జిల్లాలో అక్రమ పత్తి కొనుగోళ్లకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది. చోటా మోటా నేతలతో పాటు అడ్డు వచ్చిన అధికారులకు, వాహన డ్రైవర్లకు సైతం కమిషన్ రూపంలో ముట్టచెబుతూ పత్తి కొనుగోళ్లకు ఎగబడుతున్నారు.



సంగెపు బొర్రన్న (రైతు స్వరాజ్య వేదిక, జిల్లా అధ్యక్షుడు)

దళారి దందాను అరికట్టాలి...

● సంగెపు బొర్రన్న (రైతు స్వరాజ్య వేదిక, జిల్లా అధ్యక్షుడు)

జిల్లాలో జరుగుతున్న పత్తి దళారి దందాను అరికట్టాలి. రైతుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుంటున్న వ్యాపారులు అడ్డగోలుగా దండుకుంటున్నారు. అధికారులు కఠినంగా వ్యవహరించక పోవడమే ఈ పరిస్థితికి అసలుకారణం. ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్క్‌ఫోర్స్ అధికారులు పత్తా లేకుండానే పోయారు. జిల్లా కలెక్టర్ దీని పై ప్రత్యేక దృష్టిని సారించి రైతులు నష్టపోకుండా చర్యలు తీసుకోవాలి.

ప్రజాపాలన విజయోత్సవాలను ప్రారంభించిన ఎమ్మెల్యే

ఉట్నూర్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ప్రజాపాలన ప్రజావిజయోత్సవాల కార్యక్రమాన్ని బుధవారం ఉట్నూర్ అంబేద్కర్‌చౌరస్తాలో ప్రజాపాలన కళాయాత్ర ప్రచార రథాన్ని ఖానాపూర్ శాసనసభ్యులు వెడ్మబొజ్జుపటేల్ జెండా ఊపి ప్రారంభించారు. పదినెలల కాలంలో ప్రజాప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తుందన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో ప్రజా పాలన యేడాది పూర్తవుతున్న సందర్భంగా ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజాపాలన - ప్రజా విజయోత్సవ కార్యక్రమంలో జిల్లా పౌర సంబంధాల అధికారిణి తిరుమల, సారథి కళాకారులు తదితరులున్నారు. జిల్లా పాలనాధికారి ఆదేశానుసారం ప్రజాపాలన కళాయాత్రను సమాచార పౌరసంబంధాల శాఖ జిల్లా పౌర సంబంధాల అధికారి ఆధ్వర్యంలో సంబంధిత శాఖల సమన్వయంతో తెలంగాణ సాంస్కృతిక కళాకారులతో ప్రజా విజయోత్సవాల కార్యక్రమాలను డిసెంబర్ 7 వరకు జిల్లాలోని మండలాల్లోని ఆయా గ్రామాల్లో, మున్సిపాలిటిలలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరుగ్యారంటీలు మహాలక్ష్మి, ఇందిరా మహిళ శక్తి, గృహజ్యోతిరైతు రుణమాఫీ, ఇందిరమ్మ ఇండ్ల పై ప్రచారం చేయనున్నారని ఎమ్మెల్యే బొజ్జుపటేల్ అన్నారు. కార్యక్రమంలో జిల్లా పౌర సంబంధాల అధికారి తిరుమల, మండల పార్టీ అధ్యక్షుడు ఖయ్యుం,జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి ముత్యంరాజన్న, నాయకులు దూటరాజేశ్వర్, అజీమ్, ఇక్బాల్, కళాకారులు గోవింద్, అశీష్ తదితరులున్నారు.



పచ్చజెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ధర విషయంలో రైతులకు నష్టం జరిగితే చర్యలు

● సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్

● దళారుల వ్యాపార దుకాణాల తనిఖీ

ఇంద్రవెల్లి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): రైతులు తమ అవసరాల కోసం తీసుకొచ్చిన పత్తి, సోయాబీన్ పంట అమ్మకంలో ధర విషయంలో మోసం చేస్తే కఠినచర్యలు తీసుకుంటామని ఉట్నూర్ సబ్‌కలెక్టర్ యువరాజ్ మర్మాట్ అన్నారు. బుధవారం సాయంత్రం మండల కేంద్రంలోని వ్యాపారస్తులు ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. రైతుల వద్ద నుంచి పంట కొనుగోలు చేసిన రికార్డులు, బిల్లులను పరిశీలించడంతో పాటు కొనుగోలు చేసిన పంటలను ఎక్కడ అమ్ముతున్నారని అడిగి తెలుసుకున్నారు. మళ్ళీ దుకాణాలను తనిఖీలు నిర్వహిస్తానని, అప్పటి వరకు పంట అమ్మిన రైతుల వివరాల రికార్డులను దగ్గర ఉంచాలన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంటలు అమ్మకంలో ధర విష యంతో పాటు తూకంలో తేమ శాతం పేరుతో రైతులను మోసం చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులకు అన్యాయం చేయకుండా పంటలను కొనుగోలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ మెస్రం లక్ష్మణ్ ఉన్నారు. కాగా సబ్‌కలెక్టర్‌తో పాటు జిల్లా అధికారులు తనిఖీ చేస్తున్నట్లు ముందస్తుగా సమాచారం తెలుసుకున్న కొంత మంది దళారులు తమ కాంటాలకు దాచి పెట్టడంతో పాటు కొనుగోలు కేంద్రాలను బంద్ ఉంచడం గమనార్హం.



కేంద్రాన్ని పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్

మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలి : ఎంఈవో



విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేస్తున్న ఎంఈవో

తలమడుగు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని మెనూ ప్రకారం అందించాలని మండల విద్యాధికారి వెంకట్‌రావు కోరారు. ఆంధ్రజ్యోతిలో పాఠశాలలో విద్యార్థులకు అందని పౌష్టికాహారం, మధ్యాహ్న భోజనంలో కోడి గుడ్డుమాయం అనే కథనం ప్రచురణ కావడంతో స్పందించిన ఎంఈవో మండలంలోని ఆయా పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని తప్పనిసరిగా మెనూ ప్రకారం అందించాలన్నారు. అదే విధంగా వారానికి మూడుసార్లు విద్యార్థులకు కోడిగుడ్లు అందించాలని సూచించారు. మెనూ పాటించని ఏజెన్సీలపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అదే విధంగా ఉపాధ్యాయులు సమయ పాలన పాటించాలని సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజనానికి పరిశీలించి విద్యార్థులతో కలిసి మధ్యాహ్నం భోజనాన్ని భుజించారు.

గ్రామాల్లో ఆదివాసీ సీఆర్టీలను నియమించాలని వినతి

ఉట్నూర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లాలోని ఆదివాసీ గిరిజన గ్రామాలలో నెలకొల్పిన ఐటీడీఏ పాఠశాలల్లో ఆదివాసీ గిరిజన నిరుద్యోగులను మాత్రమే కాంట్రాక్ట్ రెసిడెన్సి టీచర్లుగా నియమించాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా ప్రధాన కార్యదర్శి సెడ్మకి రామారావు కోరారు. బుధవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయంలో గిరిజన సంక్షేమ శాఖ ఇన్‌చార్జీ డిప్యూటీ డైరెక్టర్ జాదవ్ వసంతరావును కలిసి ఈ మేరకు వినతి పత్రం సమర్పించారు. గత సంవత్సరం సీఆర్టీల నియామక కోసం ఐటీడీఏ అధికారులు పరీక్షలు నిర్వహించారని, అందులో మెరిట్‌లిస్టులో ఉన్న వారికి ప్రస్తుతం కొందరికి ఉద్యోగాలు ఇస్తున్నారని, అందులో లంబాడా వర్గానికి ఉద్యోగాలు ఇస్తూ ఆదివాసీ గ్రామాలలో నియమిస్తున్నారని అన్నారు. ఈ విషయం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి దృష్టికి తీసుకువెళ్లడం జరుగుతుందని ఇన్‌చార్జీ డీడీ తెలిపినట్లు రామారావు వివరించారు. ఆయన వెంట ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకులు అర్క.ఉమేష్, పెందూర్ షేక్‌రాజ్, ఆత్రంమారుతిలున్నారు.

అదుపు తప్పి టిప్పర్ బోల్తా

ఇచ్చోడ, నవంబరు, 20 (ఆంధ్రజ్యోతి): ఇచ్చోడ మండలంలోని గాంధీనగర్ సమీపంలో అదుపుతప్పి టిప్పర్ బోల్తాపడినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుడిహత్నూర్ మండలంలోని సోమా కంపెనీ నుంచి ఇచ్చోడ మండల కేంద్రంలో కొనసాగుతున్న రోడ్డు విస్తరణ పనుల కోసం డంబార్ (తారు) మిశ్రమాన్ని టిప్పర్‌లో తీసుకువస్తుండగా గాంధీనగర్ సమీపంలో టిప్పర్ బోల్తాపడింది. దీంతో టిప్పర్ డ్రైవర్ దినేష్ వాహనంలోనే ఇరుక్కుపోవడంతో గాయాలపాలయ్యాడు. దినేష్‌ను రిమ్స్‌కు తరలించి చికిత్స అందిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

శిక్షణ కార్యక్రమాలను వినియోగించుకోవాలి

● సీడీపీవో మాస ఉమాదేవి

ఉట్నూర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ టీచర్లు శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని ఉట్నూర్ ఐసీడీఎస్ సీడీపీవో మాస ఉమాదేవి అన్నారు. ఐసీడీఎస్ ఫ్రంట్‌లైన్ కార్యకర్తలకు శిక్షణ కార్యక్రమం సెక్యూరింగ్ న్యూట్రిషన్, ఎన్‌హాన్సింగ్ రెసిలెన్స్ ప్రాజెక్టును భాగస్వామ్యంతో స్వచ్ఛంద సంస్థల సహకారంతో భారత ప్రభుత్వ మహిళ శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ అమలు చేస్తుందన్నారు. ఈ ప్రాజెక్టు కింద దేశంలోని మిషన్ ఉత్కర్ష్ ప్రకారం 10 రాష్ట్రాలోని 10 ప్రధానమంత్రి ఉత్కర్ష్ జిల్లాలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. అందులో ఆదిలాబాద్ జిల్లా కూడా ఉండడం హర్షణీయమైన విషయమన్నారు. కార్యక్రమంలో జిల్లా మహిళ, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ అధికారులు, కన్సల్టెంట్ యోహాన్ పోషన్ అభియాన్ కోఆర్డినేటర్స్ అబ్దుల్, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

అధిక సాంద్రత పద్ధతితోనే దిగుబడులు

● శాస్త్రవేత్త డాక్టర్ ప్రవీణ్

తలమడుగు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): అధిక సాంద్రత పద్ధతితోనే అధిక దిగుబడులు సాధించవచ్చని ఏరువాక శాస్త్రవేత్త డాక్టర్ ప్రవీణ్ అన్నారు. బుధవారం కృషి విజ్ఞాన కేంద్రం ఆదిలాబాద్ ఆధ్వర్యంలో కేంద్రీయ పత్తి పరిశోధన సంస్థ నాగాపూర్ వారి సహకారంతో చేపడుతున్న అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగు అనే అంశంలో బుధవారం మండలంలోని డోర్లి గ్రామం రైతు పద్మాకర్‌రెడ్డి చేనులో క్షేత్ర దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ వై.ప్రవీణ్‌కుమార్, డాక్టర్ కె.రాజశేఖర్, నూజివీడు కంపెనీ ప్రతినిధులు రామ్మోహన్, ప్రశాంత్, మహేందర్, వైవీలు దిలిప్, మల్లేష్ 60 మంది రైతులు పాల్గొన్నారు. డాక్టర్ వై.ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ గులాబీ రంగు పురుగు ఉధృతిని తగ్గించడానికి పంట మార్పిడి చేయడానికి తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి పొందడానికి ఈ అధిక సాంద్రత పద్ధతి పత్తి సాగు ఉపయోగపడుతుందన్నారు. మండల వ్యవసాయ అధికారి ప్రమోద్‌రెడ్డి, రైతులు తిరుతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆదరిస్తే మండలిలో గళం విప్పుతా : మాజీ మేయర్



మాట్లాడుతున్న మాజీ మేయర్ రవీందర్‌సింగ్

ఉట్నూర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తానని ప్రైవేట్, ప్రభుత్వ ఉద్యోగులకు అండగా ఉంటానని, ఏ రాత్రి ఫోన్ చేసిన ఫోన్ ఎత్తే అలవాటు తనకు ఉందని, ఇరవై నాలుగు గంటలు అందుబాటులో ఉంటానని పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి, కరీంనగర్ మాజీ మేయర్ సర్దార్ రవీందర్‌సింగ్ అన్నారు. బుధవార ఉట్నూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వప్రైవేట్‌విద్యా సంస్థల్లో ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రచారం నిర్వహించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో తనకు సంపూర్ణ మద్ధతు తెలుపాలని ఉట్నూర్‌లో పలువురిని వ్యక్తిగతంగా కలిసి కోరారు.

పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం

నేరడిగొండ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పరిసరాల శుభ్రత పాటిస్తేనే ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటారని హెచ్‌ఈఓ పవార్ రవీందర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో డ్రైడే నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఆయా ఇండ్లలో అపరిశుభ్రంగా, నిల్వ ఉన్న నీటిని పారవేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎక్కడబడితే అక్కడ చెత్తా చెదారాన్ని పడేయవద్దని సూచించారు. నీరు నిల్వ ఉన్నచోట దోమలు వృద్ధి చెంది వ్యాధులకు కారణమ వుతాయని పేర్కొన్నారు. వ్యక్తిగత పరిసరాల శుభ్రత పాటిస్తేనే ఆరోగ్యంగా ఉండవచ్చని సూచించారు. ఆయన వెంట హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసరెడ్డి, రవీందర్‌లున్నారు.

బాల సదనం ఆకస్మిక తనిఖీ

ఆదిలాబాద్ రూరల్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని బాల సదనాన్ని బుధవారం డీఎల్ఎస్ఏ కార్యదర్శి బి.సౌజన్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇటీవల బాల సదనంపై వచ్చిన ఫిర్యాదుల మేరకు ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా.. బాల సదనంలో బాధితులను ఎందుకు చేర్చడం లేదని డీడబ్ల్యూఓ సబితాను ప్రశ్నించి వివరాలను సేకరించారు. బాధితులకు ఆశ్రయం కల్పించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న సిబ్బందికి మెమోలు అందించాలని ఆదేశించారు.



సిబ్బందితో మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి

జాతీయస్థాయికి విద్యార్థుల ఎంపిక



విద్యార్థులతో ఉపాధ్యాయులు

నిర్మల్‌అర్బన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : 68వ రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ నిర్వహించిన రాష్ట్రస్థాయి అండర్-17 బాలుర బాలికల పోటీల్లో విజయ ఉన్నత పాఠశాల విద్యార్థులు పాల్గొని రాష్ట్రస్థాయిలో రన్నరప్ స్థానాన్ని సాధించారు. సిల్వర్ మెడల్ పొందడంతో పాటు జాతీయస్థాయికి ఎంపిక అయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ మంచిర్యాల నాగభూషణం, ప్రిన్సిపాల్ సామమోహన్ రెడ్డిలు జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థులు టి.శ్రీనిత్, జి.ఉజ్వల్, స్టాండ్‌బై ప్లేయర్‌గా కే.సహస్రలను అభినందించారు. కార్యక్రమంలో పీఈటీలు కృష్ణవేణి, గిరిప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

షిరిడీకి చేరుకున్న పాదయాత్ర



షిర్డీకి చేరుకున్న సాయి భక్తులు

నిర్మల్ అర్బన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ పట్టణానికి చెందిన సాయిభక్తులు చేపట్టిన పాదయాత్ర బుధవారం షిరిడీకి చేరుకుంది. గండి రామన్న క్షేత్రం నుంచి ఈనెల 4వ తేదీన 20 మంది సాయిభక్తులు షిరిడీకి కాలినడకన బయలుదేరిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా భక్తులు మాట్లాడుతూ... 16 రోజులపాటు సాగిన పాదయాత్రలో సాయిబాబా కృపతో ఎలాంటి ఇబ్బంది కలుగలేదన్నారు. ఈ పాదయాత్ర కోసం సాయి దీక్ష సేవా సమితి అధ్యక్షులు లక్కడి జగన్మోహన్‌రెడ్డి అందించిన సహకారం మరువలేనిదన్నారు. జగన్మోహన్‌రెడ్డితో పాటు దేవేందర్‌రెడ్డి తదితరులకు సాయిబాబా కృప ఎల్లవేళలా ఉండాలని ప్రార్థిస్తున్నామన్నారు. కాగా అంతకు ముందు కాలినడకన షిర్డీకి చేరుకున్న సాయిభక్తులకు జగన్మోహన్ రెడ్డి, తదితరులు ఘనంగా స్వాగతం పలికి సన్మానించారు. కార్యక్రమంలో రాజన్న, మహేందర్ యాదవ్, సతీష్, రాజు, శివ, సాయి, తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో అభివృద్ధి

సారంగాపూర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలో గల చించోలి(బి) ఎక్స్ రోడ్డు వద్ద ఉన్నటువంటి మహాత్మా గాంధీ జ్యోతి బాపూలే డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు బుధవారం సోషల్ జస్టిస్ ఉమెన్స్ ఆధ్వర్యంలో సోషల్ జస్టిస్ రైట్స్ కౌన్సిల్ డాక్టర్ శాప పండరి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యతో పాటు క్రమశిక్షణ కలిగి ఉండాలని ఇతర మత్తు పదార్థాలకు గురికావద్దని పేర్కొన్నారు. సమాజంలో గుర్తింపును తెచ్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాగూర్ దత్తు సింగ్, రాపర్తి అనూష్, సంజీవ్, భీమేష్‌తో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ బాలల దినోత్సవం

సోన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పాక్‌పట్ల ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాలల దినోత్సవం ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థులు మంచి అలవాట్లను అలవర్చుకోవాలని, మాదకద్రవ్యాలకు లోను కాకుండా మంచి సమాజ నిర్మాణానికి కృషి చేయాలని ప్రధానోపాధ్యాయులు ఎన్.వెంకన్న తెలిపారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాల విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు



విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

నిర్మల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : లోకేశ్వరం మండలంలోని పిప్రి జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో ఇనిమియా నుంచి స్వచ్ఛమైన ఆరోగ్య శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు విద్యార్థులకు పరీక్షలు చేసి రక్తంలోని హిమోగ్లోబిన్ ఎంత శాంత ఉందో తెలియజేశారు. ఎవరికైతే విద్యార్థులకు హిమోగ్లోబిన్ శాంత తక్కువ ఉందో హిమోగ్లోబిన్ శాతాన్ని పెంచే పలు రకాల ఆరోగ్య సూచనలు విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాటశాల ప్రధానోపాధ్యాయులు అశోక్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

నిర్మల్ వాసికి సోషల్ వర్క్‌లో డాక్టరేట్



డాక్టరేట్ అవార్డును అందుకుంటున్న ప్రకాష్ రావు

నిర్మల్ అర్బన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ మండలం మేడిపల్లి గ్రామానికి చెందిన పొనుగోటి ప్రకాష్ రావుకు వరల్డ్ కల్చరల్ అండ్ ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ కమిషన్ డాక్టరేట్ అవార్డుకు ఎంపిక చేసింది. ఈ మేరకు బుధవారం న్యూఢిల్లీలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ప్రకాష్ రావుకు డాక్టరేట్ అవార్డును రామాయణ సీరియల్‌లోని హనుమాన్ పాత్రధారి బిందు ధారాసింగ్ అందజేశారు. ప్రకాష్ రావు జిల్లాలోనే కాకుండా రాష్ట్రంలోని చాలా మారుమూల పల్లెల్లో అనేక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పేద ప్రజలకు ఆర్థిక చేయూతనందించి వారి జీవనోపాధిని పెంపొందించడంతో పాటు ఉచిత శిక్షణ కార్యక్రమాలు, సామాజిక దురాచారాలు, డ్రగ్స్ లాంటి వాటిపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు అనేక కార్యక్రమాలు చేపట్టారు. ప్రకాష్ రావు కొనసాగిస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలను గుర్తించిన వరల్డ్ కల్చరల్ అండ్ ఎన్విరాన్మెంటల్ ప్రొటెక్షన్ కమిషన్ ఆయనకు డాక్టరేట్ ఇచ్చి గౌరవించింది.

సామాజిక సేవలో భాగస్వాములు కావాలి

ముథోల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : సామాజిక సేవలో ప్రజలు స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలని ఆధ్యాత్మిక గురువు సాయినాథ్ మహారాజ్ అన్నారు. బుధవారం మండల కేంద్రమైన ముథోల్‌లోని ప్రధాన వీధుల గుండా స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా రోడ్లను శుభ్రం చేశారు. అనంతరం స్థానిక పశుపతినాథ్ శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ సేవా కార్యక్రమాల్లో తమ వంతుగా భాగస్వాములు కావాలని సూచించారు. రైతు ఆత్మహత్యలను తగ్గించి వారు పండించిన పంటలకు గిట్టుబాటు ధరను కల్పించాలని కోరారు. అదే విధంగా స్వచ్ఛందంగా యువత ముందుకు వచ్చి రక్తదానం చేయాలని పేర్కొన్నారు. అదేవిధంగా రాను రాను భూగర్భ జలాలు తగ్గుతున్నాయన్నారు. భూగర్భ జలాల పెంపుదలకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు.

■ అన్నదాతపై.. దాడి!!



తలమడుగులో అడవి పంది దాడిలో ధ్వంసమైన పత్తి పంట, అడవి పందుల దాడిలో నష్టపోయిన పత్తిని చూపిస్తున్న రైతు నిఖిల్‌రెడ్డి

పత్తి పంటల్లో అడవి పందుల బీభత్సం

- ఆర్థికంగా నష్టపోతున్న పత్తి రైతులు
- అధికారులకు విన్నవించినా పట్టింపు కరువాయే..

తలమడుగు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలంలో పత్తి పంటపై అడవి పందుల దాడితో చేతికి వచ్చిన పంటలు భూమి పాలు కావడంతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నామని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. అసలే ఈ సంవత్సరం వర్షాలు సక్రమంగా కురవకపోవడంతో పంటలు పండక రైతులు దిగులు చెందుతుంటే మూలిగే నక్కపైన తాటికాయ పడ్డట్టు పత్తి పంటపై అడవి పందులు దాడులు చేయడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ సంవత్సరం పంటలు పండక దిగుబడి రాక చేసిన అప్పులు ఏ విధంగా తీరుతాయి అన్న బెంగతో రైతులు తల్లడిల్లుతుంటే అడవి పందులు ఉన్న పంటలను నాశనం చయడంతో రైతులు మరింత ఆందోళనకు గురవుతున్నారు. అడవి పందుల నుంచి పంటలను కాపాడాలని పలుమార్లు సంబంధిత శాఖ అధికారులకు విన్నవించినా ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. అంతేకాకుండా అడవి పందులు పంట పొలాలు కాకుండా రాత్రిపూట గ్రాఆమల్లోకి వస్తున్నాయని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తలమడుగు గ్రామ సమీపంలో గల రావుల నిఖిల్‌రెడ్డి వ్యవసాయ పొలంలో అడవి పందులు దాడి చేసి దాదాపు రెండు ఎకరాల పత్తి పంటను పూర్తిగా ధ్వంసం చేయడంతో దాదాపు 50 వేల వరకు నష్టపోయామని రైతు ఆందోళన వ్యక్తంచేశారు. కాగా గత సంవత్సరం కూడా మండలంలో దాదాపు 200 ఎకరాల్లో పంటలను అడవి పందులు పంటలను నాశనం చేయడంతో రైతులు గ్రామ పంచాయితీ తీర్మానం చేసి వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలతో అటవీ అధికారులకు దరఖాస్తులు చేసుకున్నా ఇప్పటి వరకు ఏ ఒక్క రైతుకు కూడా నష్టపరిహారం అందలేదని రైతులు తెలిపారు. పంటలను కాపాడుకునేందుకు రైతులు రాత్రి పగలు వ్యవసాయ పంట పొలాల వద్దనే ఉండవలసిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఇకనైనా అధికారులు స్పందించి అడవి పందుల దాడిలో నష్టపోయిన రైతులందరికీ నష్ట పరిహారం అందించి, ఆదుకోవాలని రైతుల కోరుతున్నారు.



- వ్యవసాయ పొలాల్లో పంటలను నాశనం చేస్తున్న అడవి పందులు

■ జర దేఖో!!





డేంజర్ జోన్‌లో ఉన్న మూల మలుపులు

ఆ మలుపులు.. మృత్యు పిలుపులు!

- ఇప్పటి వరకు పదుల సంఖ్యలో మృతి
- దివ్యాంగులుగా మారిన 20 మంది యువకులు
- పట్టించుకోని పాలకులు, అధికారులు

తాంసి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆ మలుపులు యమ డేంజర్‌గా ఉన్నాయి. నిత్యం వేలాది మంది వాహన చోదకులు రాకపోకలు సాగించే అంతర్ రాష్ట రహదారిపై ఉన్న మూల మలుపులు నిత్యం ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ఈ మలుపు మండలంలోని హస్నాపూర్ గ్రామ సమీపంలో ఉంది. ఈ మలుపు వద్ద ఇప్పటి వరకు సుమారు 18 మంది మృతి చెందారు. అనేక మంది దివ్యాంగులుగా మారారు. గత వారం రోజుల క్రితం కూడా ఓ ప్రమాదం జరిగి ద్విచక్ర వాహనదారుడు మృతి చెందాడు. ఇక తాంసి మండల కేంద్రానికి సమీపంలో ఉన్న సుంకిడి, తాంసి గ్రామాల మధ్య ఉన్న మలుపు వద్ద కూడా అరుగురు చనిపోయారు. అనేక మంది గాయాలపాలైన చికిత్స పొందుతున్నారు. ఈ విషయాలను నిత్యం తాంసి, తలమడుగు మండలాల అధికారులు చూస్తున్నా.. ఎలాంటి చర్యలు చేపట్టడం లేదన్న ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. మరో రెండు, మూడు నిమిషాల్లో ఇంటికి చేరుతామన్న తరుణంలోనే ఈ ప్రమాదాలు సంభవించడంతో.. వారి కుటుంబాల్లో విషాదం నెలకొంటున్నాయి. ఎదురెదురుగా వస్తున్న వాహనాలు ఢీ కొట్టడంతో పాటు నిటారుగా వెళుతున్న వాహనాలు సైతం ఈ మూల మలుపు నుంచి నిటారుగా వాగులో పడి మృతి చెందుతున్న సంఘటనలు కూడా ఉన్నాయి. ఇకనైనా అధికార ప్రభుత్వం, అధికార యంత్రాంగం, రోడ్డు రవాణా సంస్థ అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని తాంసి, తలమడుగు, భీంపూర్ మండలాల ప్రజలతో పాటు మహారాష్ట్ర వాహనదారులు సైతం కోరుతున్నారు.

మహారాష్ట్ర వైపు వెళ్తున్న జానీ టైగర్

ఉట్నూర్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల అడవులను చుట్టేసిన జానీ టైగర్ ఎట్టకేలకు మహారాష్ట్రలోని తిప్పేశ్వర్ అభయారణ్యం ప్రాంతానికి చేరువలో ఉన్నట్లు అటవి శాఖ వర్గాలు పేర్కొంటున్నాయి. గత ఆదివారం ఉట్నూర్ మండలం చీమ నాయక్‌తండా ప్రాంతంలోని నాగపూర్ చెరువుగుండా చాందోరి రాజు గూడాల మీదుగా నార్నూర్ మండలంలోకి ప్రవహించిన పెద్దపులి సోమవారం మంగళవారం ఉట్నూర్ నార్నూర్ ఇంద్రవెల్లి మండలాల సరిహద్దుల్లో ఉన్న అటవి ప్రదేశాలలో తలదాచుకుంది. బుధవారం ఉమ్మడి నార్నూర్ మండలంలోని కాడికి ప్రాంతంలో పాదముద్రలు గుర్తించిన అటవి శాఖ అధికారులు దానిని వెంబడిస్తూ పులికి ఎలాంటి హాని జరగకుండా చూసుకుంటున్నారు. సాయంత్రం ఐదున్నర గంటలకు పెన్‌గంగా పరివాహక ప్రాంతంలో మహారాష్ట్రకు రెండు కిలో మీటర్ల దూరంలో జారీ టైగర్‌సంచరిస్తున్నట్లు అటవి శాఖ అధికారులు గుర్తించారు. పెన్‌గంగా పరివాహక ప్రాంతం నుంచి ఆదిలాబాద్ జిల్లాలోకి ప్రవేశించిన పెద్దపులి తిరిగి పెన్‌గంగా ప్రాంతం నుంచే మహారాష్ట్రలోని అభయారణ్యంకు తిరిగి వెళ్తుండడంతో అటవీ శాఖ అధికారులతో పాటు ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.





మోటార్ సైకిల్‌పై సంచిలో ఎర్ర మట్టిని తెచ్చి రోడ్డుపై గుంతను పూడుస్తున్న వృద్ధుడు పాలిక్ నర్సయ్య

వృద్ధుడి ఉదారత్వం.. అందరికీ ఆదర్శం

భోథ్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ఎస్బీఐ బ్యాంకు రోడ్డుపైన ఉన్న ఎలక్ట్రానిక్ దుకాణం వద్ద రోడ్డుపై గత వారం రోజులుగా గుంత ఏర్పడింది. దీంతో రాకపోకలు సాగించే ద్విచక్ర వాహణాల వారికి ఇబ్బందికరంగా మారింది. గుంతను ఎవరూ పట్టించుకోకపోవడంతో వృద్ధుడైన పాలిక నర్సయ్య తనకున్న లూనా మోపెడ్‌పైన ఒక బస్తాలు ఎర్ర మట్టిని తెచ్చి గుంతను నింపాడు. ఆయన చేసిన సేవను చూసి పలువురు మెచ్చుకున్నారు.

మహారాష్ట్రలో ఓటు వేసేందుకు వెళ్లిన వలస కూలీలు

తలమడుగు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్య వ్యవస్థలో భారత రాజ్యాంగం కల్పించిన ఓటుహక్కు అనే ఆయుధాని ప్రజలందరూ స్వచ్ఛందంగా వినియోగించుకోవాలని భారత ఎన్నికల సంఘం సూచించడంతో బుధవారం మహారాష్ట్రలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు వలస కూలీలు ఉదయం మహారాష్ట్రకు బయలుదేరి వెళ్లారు. ఉపాధి పనుల కోసం తెలంగాణ ప్రాంతానికి వచ్చిన కూలీలు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ధృడ సంకల్పంతో వివిధ వాహనాల ద్వారా అంతర్ రాష్ట లక్ష్మీపూర్ మీదుగా మహా రాష్ట్రకు ఓటర్లు వెళ్లారు.



మహారాష్ట్రకు వెళుతున్న వలస కూలీలు

మత్తడివాగు ప్రాజెక్టుకు జలకళ

- పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని సందర్శకుల కోరిక
- ప్రాజెక్టు వద్ద కరువైన పర్యవేక్షణ
- పట్టించుకోని నాయకులు, అధికారులు

తాంసి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని వడ్డాడి గ్రామ సమీపంలో ఉన్న మత్తడివాగు ప్రాజెక్టు నిండుకుండలా కనిపిస్తుంది. ప్రాజెక్టుకు జలకళ వచ్చినట్లు కనిపిస్తుంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 276.50 మీటర్లు కాగా బుధవారానికి 275.3 మీటర్ల పూర్తి స్థాయి నీటి మట్టానికి చేరుకుంది. దీంతో ప్రాజెక్టు నిండుకుండలా కనిపిస్తుంది. అంతర్రాష్ట రహదారి పక్కన ఈ ప్రాజెక్టు ఉండటంతో వచ్చిపోయే వారు ప్రాజెక్టులోని నీటిని చూస్తూ ఆస్వాదిస్తుంటారు. ఇక రబీ సాగుకు కూడా ఈ ఏడు పుష్కలంగా నీరు అందుతుందని ప్రాజెక్టు కింద రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఈ ఏడు ఖరీఫ్‌లో ఆశించిన స్థాయి పంటలు లేకపోవడం వల్ల కనీసం రబీ సాగు అయిన తమను ఆదుకుంటుందని రలైఉలు ఆశాభావం వ్యక్తంచేస్తున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టు నీటి మట్టాన్ని చూస్తే రబీ సాగుకు పూర్తిస్థాయి అందేలా కనిపిస్తుందని రైతులు అంటున్నారు.

● వర్షాలు మొండికేసినా.. తగ్గని నీటి మట్టం!!

గత 40 రోజుల నుంచి వర్షాలు మొండికేసినప్పటికీ మత్తడి వాగు ప్రాజెక్టులోని నీటిమట్టం మాత్రం తగ్గలేదు. నిత్యం నిండుకుండలా కనిపిస్తుంది. ప్రాజె క్టు సమీపంలో నుండి రాక పోకలు సాగించే జనం కూడా సంబర పడుతున్నారు. ఫొటోలకు ఫోస్ ఇచ్చి సెల్ఫీలు, ఫొటోలు దిగుతున్నారు.

● ప్రాజెక్టు వద్ద ఏర్పాట్లు కరువు

నిత్యం వందలాది మంది జనం ప్రాజెక్టు వద్ద సేద తీరేందుకు వస్తూ ఉంటారు. కాని ప్రాజెక్టు వద్ద ఎలాంటి సౌకర్యాలు కల్పించడం లేదు. కనీసం అక్కడ పర్యవేక్షించే నాథుడే కరువయ్యాడు. దీంతో ఎప్పుడు ఏమి జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొందని పలువురు అంటున్నారు. ఇకనైనా అధికార యంత్రాంగం, ప్రభుత్వం స్పందించి మత్తడి వాగు ప్రాజెక్టు వద్ద ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



- పూర్తిగా నిండి ఉన్న మత్తడి వాగు ప్రాజెక్టు

● పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలి

మత్తడి వాగు ప్రాజెక్టు ఆహ్లాదంగా ఉందని దీన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని పలువురు కోరుతున్నారు. ప్రాజెక్టు చుట్టూ పక్కల పచ్చని చెట్లు ఉండటం నిత్యం నీటి ప్రవాహం కనిపించడంతో సందర్శకులు నిత్యం వచ్చి పోతున్నారు. అయితే ఇక్కడ ప్రత్యేకంగా ఏవైనా చిరుతిళ్ళకు సంబంధించిన కుటీరాలను ఏర్పాటు చేయాలని సందర్శకులు కోరుతున్నారు. రాత్రి సమయంలో వీధి లైట్లు కూడా ఏర్పాటు చేయాలని అంటున్నారు.



తాంసిలో భారీ వర్షాలకు ముంపునకు గురైన పంట పొలం(ఫైల్)



ముంపు ప్రాంతాలను పరిశీలిస్తున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ (ఫైల్)


పంట నష్ట పరిహారం జాడేది?

- గత ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో కురిసిన భారీ వర్షాలు
- తాంసి మండలంలో 300 ఎకరాల్లో పంటలకు నష్టం
- పరిహారం కోసం అన్నదాతల ఎదురు చూపులు

■ ఆంధ్రజ్యోతి పరిశీలన

తాంసి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): గత ఆగస్టు చివరి వారం సెప్టెంబరు మొదటి వారంలో భారీ వర్షాలు కురిసాయి. దీంతోయ పంట పొలాల్లోకి వరద నీరు చేరి తీవ్ర నష్టాలు కలిగించాయి. తాంసి మండలంలో సుమారు మూడు వందల ఎకరాలలో పంటలకు నష్టం వాటిల్లింది. అయితే ప్రభుత్వం ఎకరానికి పది వేల చొప్పున పరిహారం అందిస్తామని అప్పట్లో ప్రకటించింది. దీంతో ముంపు రైతులు కొంత సంతోషం వ్యక్తంచేశారు. కాని ఆ పరిహారం ఇంత వరకు సంబంధిత రలైఉలకు అందలేదని అంటున్నారు. అప్పట్లో ముంపును తెలుసుకున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ హుటాహుటిన ముంపు ప్రాంతాల్లో పర్యటించి రైతులను ఓదార్చారు. ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు. ఇక ప్రభుత్వం పరిహారం ప్రకటించింది. కదా పరిహారం వస్తుంది అని భరోసా ఇచ్చారు. కాని విపత్తు జరిగి మూడు నెలలు గడిచినా ఇప్పటి వరకు నయా పైసా రాలేదని నష్టపొలైన రైతులు వాపోతున్నారు. ఈ విషయంపై ఎవరూ స్పందించడం లేదని అంటున్నారు. అటు రెవెన్యూ శాఖ అధికారులు అంటి ముట్టనట్లుగా ఉంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అసలు ప్రభుత్వం నుంచి పరిహారం వచ్చిందా లేదా అనే విషయం తమకు తెలియడం లేదని అంటున్నారు. రెవెన్యూ అధజకారులు ఎందుకు గోప్యత పాటిస్తున్నారని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఈ విషయంపై ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని తాంసి మండల ముంపు రైతులు కోరుతున్నారు. ఈ విషయంపై తహసీల్దార్‌ను వివరణ కోరేందుకు ఆంధ్రజ్యోతి ప్రయత్నించగా అందుబాటులో లేరు.



ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
బుధవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 29.6 । కనిష్ఠం 15.07

నిర్మల్
జిల్లా వార్తలు
8
గురువారం 21 నవంబరు 2024

నూతన డీఈవో బాధ్యతల స్వీకరణ



నిర్మల్‌కల్చరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ జిల్లా నూతన డీఈవోగా పి.రామారావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. భద్రాద్రి కొత్త గూడెం జిల్లాలో అడిషనల్ డైరెక్టర్‌గా పనిచేసిన ఆయన నిర్మల్ డీఈవోగా నియమితులయిన విషయం తెలిసిందే.

సిరాలకు మంచి రోజులు


తెగిపోయిన ప్రధాన కాలువ

- ప్రాజెక్టు పునఃనిర్మాణానికి రూ. 9 కోట్ల నిధుల విడుదల
- 2వేల ఎకరాలకు సాగునీరు అందించడమే లక్ష్యం
- గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో నిలిచిపోయిన పనులు
- కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నిధుల మంజూరుకు సర్కారు ఆదేశాలు

నిర్మల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని భైంసా శివారులో గల సిరాల ప్రాజెక్టుకు మళ్లీ మంచి రోజులు రానున్నాయి. 2003 సంవత్సరంలో వచ్చిన వరదల కారణంగా ఈ ప్రాజెక్టు పూర్తిగా కొట్టుకుపోయిన సంగతి తెలిసిందే. ప్రాజెక్టుతో పాటు దీని కింది పరిధిలో గల మరో చెరువు సైతం వరద ధాటికి తుడిచి పెట్టుకుపోయింది. ఈ ప్రాజెక్టు కింద దాదాపు 2వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందింది. అయితే ప్రాజెక్టు వరద పాలు కావడంతో గత రెండు సంవత్సరాల నుంచి దీని పరిధిలోని ఆయకట్టుకు సాగునీరు పూర్తిగా నిలిచిపోయింది. తద్వారా రైతులు పంటలను నష్టపోయారు. అయితే అప్పట్లో ప్రాజెక్టును పునర్నిర్మించేందుకు అధికారులు దాదాపు రూ.13 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించి రాష్ట్ర సర్కారుకు నివేదించారు. అప్పటి ప్రభుత్వం ఈ ప్రతిపాదనలను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్న ఆరోపణలున్నాయి. ప్రాజెక్టుతో పాటు దీని కింద గల కాలువలు సైతం వరద ఉధృతికి కనుమరుగయ్యాయి. దీంతో పంటలకు నీరందని పరిస్థితి ఏర్పడింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు సిరాల ప్రాజెక్టుపై దృష్టి కేంద్రీకరించింది. వెంటనే పాత ప్రతిపాదనలను పరిశీలించి అధికారుల పరిశీలన కోసం పంపింది. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం రూ.13 కోట్ల ప్రతిపాదనల్లో భాగంగా మొదట సిరాల ప్రాజెక్టు పునర్నిర్మాణం కోసం రూ.9 కోట్లను విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అయితే సాంకేతికత కారణంగా రూ.8 కోట్లకే సంబంధిత కాంట్రాక్టర్ అగ్రిమెంట్ పూర్తి చేసుకున్నాడు. దీంతో పనులు కొద్ది రోజుల్లోనే మొదలు కానున్నాయి. సిరాల ప్రాజెక్టుకు ప్రభుత్వం శ్రీరామస్వామి ప్రాజెక్టుగా నామకరణం చేసింది. ప్రాజెక్టు గరిష్ఠ నీటి సామర్థ్యం 24 అడుగులుగా నిర్ధారిస్తున్నారు. అయితే వరుసగా ఎగువ నుంచి వస్తున్న వరదలతో ప్రాజెక్టులో పూడిక పెద్దమొత్తంలో చేరుకుంది. దీని కారణంగా ప్రస్తుతం ప్రాజెక్టుతో 14 అడుగుల వరకు పూడిక పేరుకుపోయినట్లు చెబుతున్నారు. ప్రతీయేటా ఖరీఫ్‌లో ఈ ప్రాజెక్టు ద్వారా ఖరీఫ్, రబీ సీజన్‌లకు పుష్కలంగా సాగునీరు అందేది. అలాంటిది ప్రకృతి కన్నెర్ర కారణంగా మొత్తం ప్రాజెక్టు నీటిలో కొట్టుకుపోయింది.

రూ.9కోట్ల నిధుల విడుదల

కాగా.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే సిరాల ప్రాజెక్టు ప్రతిపాదనలను సీరియస్‌గా పరిగణించింది. ఇందులో భాగంగానే ఉన్నతాధికారులతో పలుసార్లు సమీక్షలు జరిపి అధికారులు పంపిన ప్రతిపాదనలపై కసరత్తు చేసింది. ఇరిగేషన్ అధికారులు సిరాల ప్రాజెక్టు పునర్నిర్మాణం కోసం రూ.13 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. అయితే అధికారులు ఈ ప్రతిపాదనలు పరిశీలించిన అనంతరం మొత్తం రూ.9 కోట్లను సిరాల ప్రాజెక్టు కోసం విడుదల చేస్తూ ఉత్తర్వులు సైతం జారీ చేశారు. ప్రభుత్వం వెనువెంటనే టెండర్ ప్రక్రియను నిర్వహించి ప్రాజెక్టు పునర్నిర్మాణ పనులను చేపట్టేందుకు సిద్ధమవుతోంది. ఇప్పటికే సదరు కాంట్రాక్టర్ అగ్రిమెంట్ ప్రక్రియను కూడా పూర్తి చేశారు. సిరాల ప్రాజెక్టుతో పాటు దీని దిగువన గల ఇలేగాం చెరువు పనులకు కూడా రూ. కోటి రూపాయలను ప్రభుత్వం విడుదల చేసింది. పెద్ద మొత్తంలో నిధులు విడుదలవ్వడమే కాకుండా టెండర్ ప్రక్రియ పూర్తి కావడంతో ఇక పనుల ప్రారంభానికి ఆలస్యం జరగదంటున్నారు.

2వేల ఎకరాల ఆయకట్టు లక్ష్యంగా..

సిరాల ప్రాజెక్టుతో పాటు దీని పరిధిలోని ఇలేగాం చెరువు కింద మొత్తం 2వేల ఎకరాలకు సాగునీరు అందించాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకుంటున్నారు. పురాతనమైన సిరాల ప్రాజెక్టుకు గత ప్రభుత్వం ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయని కారణంగా రైతులకు ఇది శాపంగా మారింది. గత ప్రభుత్వం ఈ ప్రాజెక్టు పునర్నిర్మాణం కోసం పంపిన ప్రతిపాదనలను పరిశీలించకుండా పక్కన పడేసింది. అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు చాలాసార్లు నిధుల విషయమై ప్రభుత్వానికి చేసిన విజ్ఞప్తులన్నీ బుట్టదాఖలయ్యాయి. అలాగే సిరాల ప్రాజెక్టు పరిధిలోని రైతులు సైతం దీని కోసం ఆందోళనలు కూడా చేశారు. అయినా ప్రభుత్వం పట్టించుకోలేదు. ఎన్నికల సమయంలోనే కాంగ్రెస్ పార్టీ నేతలు అప్పటి పీసీసీ ప్రసిడెంట్, ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. అధికారంలోకి రాగానే సిరాల ప్రాజెక్టును పునర్నిర్మిస్తామంటూ రేవంత్‌రెడ్డి అప్పట్లో హామీనిచ్చారు. ఇప్పటికే ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేరుస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం అనుకున్నట్లుగానే సిరాల ప్రాజెక్టుకు నిధులు విడుదల చేసింది. దీంతో పాటు ఈ ప్రాజెక్టు పరిధిలోని ఇలేగాం చెరువుకు కూడా కోటి రూపాయలను విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీని కారణంగా రాబోయే వేసవి చివరి వరకు పనులన్నింటినీ పూర్తి చేసి తిరిగి 2వేల ఎకరాలకు సాగునీరు అందించాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకుంటున్నారు.

ఇరిగేషన్‌కు పెద్దపీట

ఇరిగేషన్ రంగానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తున్న కారణంగా నిర్మల్ జిల్లాలోని ప్రాజెక్టులకు సైతం మహర్దశ పట్టనుంది. ఇప్పటికే డ్రిప్ కింద మూడు ప్రాజెక్టులకు భారీ మొత్తంలో నిధులు మంజూరు కాబోతున్నాయి. మొదట కడెం ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం దాదాపు రూ.7 కోట్లను విడుదల చేసి ఆధునికీకరణ పనులన్నింటినీ పూర్తి చేసింది. దీంతో ఆ ప్రాజెక్టు పరిస్థితి ప్రస్తుతం ఎంతో మెరుగైంది. అలాగే గడ్డెన్నవాగు, స్వర్ణ ప్రాజెక్టులకు సైతం డ్రిప్ కింద నిధులు మంజూరు కాబోతున్నాయి. ప్రస్తుతం సిరాల ప్రాజెక్టుకు ప్రభుత్వం రూ.9 కోట్లను విడుదల చేయడంతో ఇక ప్రాజెక్టుల పరిస్థితి మరింత మెరుగుకానుంది. ప్రాజెక్టుల పునర్నిర్మాణ పనులు ఆధునికీకరణ పనులు పూర్తయితే.. చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించడమే కాకుండా నిర్దేశిత లక్ష్యం మేరకు నీరు అందించే అవకాశం ఏర్పడనుందని అంటున్నారు. మొత్తానికి సిరాల ఆయకట్టు రైతులకు ఇక శుభపరిణామని చెప్పొచ్చు..!!


నిర్మల్ జిల్లా సిరాల ప్రాజెక్టు మరమ్మతు పనులకు ఇటీవల భూమి పూజ చేసిన ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ (ఫైల్)


బీడుగా మారిన భూములు


మరమ్మతు పనులు చేపడుతున్న దృశ్యం


ప్రాజెక్టు కట్ట తెగిపోవడంతో ఆయకట్టు భూములు బీడుగా మారిన దృశ్యం

ధైర్యంగా ఉండండి.. అండగా ఉంటాం!

- ఆర్జీయూకేటీ విద్యార్థులతో అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్


వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ గోవర్ధన్, అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

బాసర, నవంబర్, 20 : (ఆంధ్రజ్యోతి) : ఆర్జీయూకేటీ బాసర స్టూడెంట్ వెల్ఫేర్ డిపార్టుమెంట్, నిర్మల్ జిల్లా చైల్డ్‌వెల్ఫేర్ డిపార్టుమెంట్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ గోవర్ధన్, అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ పాల్గొని ప్రసంగించారు. విద్యార్థులు ధైర్యంగా ఉండాలని, సమస్యలు పరిష్కరించడానికి అధికారులుగా అండగా ఉంటామని తెలిపారు. ప్రతి సమస్యకు పరిష్కారం ఉంటుందని విజయాన్ని అందుకునే సమయంలో అనేక సవాళ్లు ఎదురవుతాయని వాటిని అధిగమించేందుకు అనేక మార్గాలు ఉంటాయని, తమ తమ స్వీయ జీవితానుభావాలను తెలిపారు. ఉలి దెబ్బలు తట్టుకుంటేనే రాయి శిల్పంగా మారినట్టు జీవితంలో వచ్చే ఒడిదొడుకులను తట్టుకుంటే ఉన్నత విద్య ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రణధీర్ సాగి, అసోసియేట్ స్టూడెంట్ వెల్ఫేర్ డా.నాగరాజు, డాక్టర్ పావని, నిర్మల్ జిల్లా చైల్డ్ వెల్ఫేర్ డిపార్టుమెంట్ అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


పోక్సో చట్టం పోస్టర్ విడుదల చేస్తున్న అధికారులు

సోషల్ మీడియా ప్రచారాన్ని నమ్మకండి

- ట్రిపుల్ ఐటీ విద్యార్థి సంఘం విజ్ఞప్తి

బాసర, నవంబర్, 20 : (ఆంధ్రజ్యోతి) : బాసర ఆర్జీయూకేటీ ట్రిపుల్ ఐటీ గురించి సోషల్ మీడియాలో అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారని అలాంటివి ఎవరూ నమ్మవద్దని తెలంగాణ స్టూడెంట్ అసోసియేషన్ ట్రిపుల్ ఐటీ విభాగం విజ్ఞప్తి చేసింది. ట్రిపుల్ ఐటీలో మరణాలపై అబద్ధపు సంఖ్యతో కొంత మంది ఇంటర్వ్యూల్లో పేర్కొన్నారని, వాటిల్లో వాస్తవాలు లేవని ఓ ప్రకటనలో ఖండించారు. వాట్సాప్, ఫేస్ బుక్, ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబుల్లో కొన్ని అవాస్తవాలు ఇంటర్వ్యూల పేరిట ప్రచారం చేస్తున్నారని, విద్యార్థుల తల్లిదం డ్రులు కాని, ఇతరులు గాని వాటిని నిజ మని ఆందోళనకు గురికావద్దని పేర్కొ న్నారు. ఈ విషయంలో మేము యూని వర్సిటీ అధికారులతో కలిసి పోరా డుతా మని ఫేక్‌డాటాతో వీడియోలను తొలగిం చేలా ప్రయత్నిస్తున్నట్లు ట్రిపుల్ ఐటీ విభాగం పేర్కొంది.

బస్సు సౌకర్యం కల్పించాలని మహిళల ధర్నా

- ఎమ్మెల్యే చొరవతో ధర్నాను విరమించిన మహిళలు


మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

దస్తురాబాద్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : తమ గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని మండలంలోని గొడిసిర్యాల గ్రామ మహిళలు బుధవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా కలమడుగు - కడెం ప్రధాన రహదారిపై బైఠాయించి రాస్తారోకో చేశారు. సుమారు ఇరవై ఏళ్ల క్రితం నిర్మల్ డిపో బస్సు గ్రామం మీదు గా ప్రయాణించేదని తెలి పారు. అదేవిధంగా ఉట్నూర్, జగిత్యాల డిపోల నుంచి మండల కేంద్రంగా ప్రయా ణిస్తున్న బస్సులను గొడి సిర్యాల గ్రామం గుండా నడిపించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఉచిత బస్సు ప్రయా ణాన్ని వినియోగించుకోలేకపోతున్నామని వాపోయారు. మండలంలోని కాంగ్రెస్ నాయకుడి కూతురి వివాహానికి హాజరైన ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ విషయం తెలుసుకుని వెంటనే ధర్నా వద్దకు చేరుకొని, మహిళల సమస్యలను తెలు సుకున్నారు. అనంతరం ఆర్టీసీ ఆర్ఎం, డీఎంతో ఫోన్‌లో మాట్లాడి బస్సు సౌకర్యం కల్పించాలని ఆదేశించారు. దీంతో అధికారులు సర్వే చేపట్టి త్వరలో బస్సు సౌకర్యం కల్పించేలా చర్యలు చేపడతారని పేర్కొన్నారు. ప్రజలకు ఏ సమస్యలున్నా నేరుగా తన దృష్టికి తీసుకురా వాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. ఎమ్మెల్యే హామీ ఇవ్వడంతో మహిళలు ధర్నాను విరమించారు. కార్యక్రమం లో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దుర్గం మల్లేష్, నాయకులు శ్రీనివాస్, ప్రసాద్, సురేందర్, గోపి తదితరులున్నారు.

వేధింపులకు పాల్పడితే చర్యలు

- ఎస్పీ జానకి షర్మిల
- మహిళా రక్షణ పోస్టర్ విడుదల


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎస్పీ జానకి షర్మిల

నిర్మల్‌కల్చరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మహిళలు, విద్యార్థులపై ఆకతాయిలు మానసికంగా, శారీరకంగా హింసించి, సోషల్ మీడియాలో మార్ఫింగ్ చేసి పోస్టులు పెట్టినట్లైతే కఠిన చర్యలుంటాయని ఎస్పీ జానకి షర్మిల హెచ్చరించారు. బుధవారం షీ టీమ్స్, భరోసా సిబ్బంది రూపొందించిన లైంగిక వేధింపులు, మహిళా చట్టాలు, పోక్సో బాల్య వివాహాలపై పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... మహిళలకు పోలీసులు అన్ని విధాలుగా అండగా ఉంటారన్నారు. మహిళలు ఆకతాయిల వేధింపుల సమాచారం షీ టీమ్స్‌కు అందిస్తే అట్టి వారిని పట్టుకుని చర్యలు తీసుకుంటామన్నారు. మైనర్లకు కౌన్సిలింగ్ ఇస్తామన్నారు. మానవ అక్రమ రవాణా, బాలల అక్రమ రవాణాలపై సమాచారం అందించాలని, ఎవ్వరిని వదిలి పెట్టమని తెలిపారు. కొత్త వ్యక్తులు చెప్పే మాటలను నమ్మి మోసపోవద్దని సూచించారు. బాలలను అక్రమ దత్తత లాంటివి పోలీసుల దృష్టికి తేవాలన్నారు. 100, 1098 నెంబర్‌కు షీ టీమ్స్ నెంబర్ 8712659550కు ఫోన్ చేయాలన్నారు. ఆర్ఎస్సైలు వినోద్, రవి కుమార్, షీ టీమ్స్ ఎస్సై సుమాంజలి, భరోసా సిబ్బంది పాల్గొన్నారు.

గ్రంథాలయాలను వినియోగించుకోవాలి

- అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్
- ముగిసిన వారోత్సవాలు


మాట్లాడుతున్న గ్రంథాలయ చైర్మన్ అర్జుమన్ అలీ

నిర్మల్‌కల్చరల్, నవంబరు 20 : ప్రజలు, విద్యావంతులు, విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అన్నారు. బుధవారం నిర్మల్ జిల్లా గ్రంథాలయంలో 57వ వారోత్సవాల ముగింపు సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఉద్యోగాల కోసం ప్రయత్నిస్తున్న నిరుద్యోగులు గ్రంథాలయంలో లభించే పోటీ పరీక్షల సామగ్రి ఉపయోగించుకోవాలని సూచించారు. ప్రభుత్వం గ్రంథాలయాల్లో అన్నిరకాల విజ్ఞాన పుస్తకాలు సమకూర్చుతుందన్నారు. మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ అర్జుమన్ అలీ మాట్లాడుతూ... వ్యక్తిత్వ వికాస సాధనకు గ్రంథాలయాలు దోహదం చేస్తాయన్నారు. వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన పలు పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులను అందజేశారు. కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నాందేడపు చిన్ను, సారంగాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ అబ్దుల్‌హాది పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలకు కృషి

- ఇథనాల్ పరిశ్రమ డీజీఎం భరత్ యాదవ్


విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న పీఎంఆర్ సంస్థ ప్రతినిధులు

దిలావర్‌పూర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఇథనాల్ పరిశ్రమ పరిధిలోని గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాల కల్పనకు కృషి చేస్తామని ఇథనాల్ పరిశ్రమ డీజీఎం భరత్ యాదవ్ అన్నారు. మండలంలోని బన్సపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులకు బ్యాగులు, నోటు పుస్తకాలు, అభ్యసన పరికరాలు పంపిణీ చేశారు. భవిష్యత్‌లో ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్మాణం, మంచినీటి సౌకర్యం, క్రీడా పరికరాలు, కంప్యూటర్లు, లాప్టాప్‌లు పంపిణీ చేస్తామన్నారు. ఇతర మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. గ్రామాల్లో సైతం అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కృష్ణవేణి, ఉపాధ్యాయులు, పీఎంఆర్ కంపెనీ పీఆర్‌వోలు వి. రవీందర్ రెడ్డి, మహేష్‌లు పాల్గొన్నారు.

రైతులు వాగు దాటొద్దు

- ఎంపీడీవో


వాగును పరిశీలిస్తున్న ఎంపీడీవో

కుంటాల, నవంబర్, 20 : (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కల్లూరు సమీపంలో పోచంపాడ్ నిల్వనీటిపై కల్లూరు గ్రామస్థులు పంట పొలాలకు వెళ్లేందుకు గ్రామసమీపంలో (బూరుగుపల్లి శివారులో) నిర్మించిన వంతెన గతేడాది కూలిపోయింది. ప్రస్తు తం వర్షాకాలంలో కురిసిన వర్షాలకు ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ నిండుగా ఉండడంతో రైతులు పంట పొలాలకు ఇబ్బందిగా మారిందని అయితే కొంతమంది రైతులు మిషన్ భగీరథ నీటి కోసం ఏర్పాటు చేసిన పైపుగుండా వాగుదాటుతున్నా రని తెలుసుకున్న ఎంపీడీవో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం స్థలాన్ని పరిశీలించారు. అయితే రైతులు పంట పొలాలకు వేరే మార్గాన వెళ్లాలంటే భైంసా మండలం పెండ్‌పెల్లి, మొత్కపల్లి గ్రామాల మీదుగా రావాలి. ఇలా రావాలంటే దాదా పు 20 కిలోమీటర్ల మేర దూరం వస్తుంది. ఇలా వెళ్లలేక కొంత మంది రైతుమిషన్ భగీరథ పైపు ద్వారా వెళుతున్నారని, అలా సాహసం చేయవద్దని ఎంపీడీవో సూచించారు. కొంతమేర దూరమైనప్పటికీ సుఖంగా ప్రయాణం చేయడమే ముఖ్య మని కావున రైతులు ఈ వాగుపై నుంచి వెళ్లకూడదని సూచించారు. ఈయన వెంట ఎంపీవో రహీం, పంచాయతీ సెక్రటరీ భోజన్న గ్రామస్తులు, రైతులు బద్దం మోహన్ రెడ్డి గంగాధర్, ముత్యం, తదితరులున్నారు. ఈ సందర్భంగా రైతులు వీలైనంత త్వరలో బ్రిడ్జి నిర్మాణం చేపడితే తమ పంటపొలాలకు వెళ్లేందుకు సులువుగా ఉంటుందని పేర్కొన్నారు.